క్లుప్తంగా

మానవత సభ్యత్వ నమోదు



సభ్యత్వం తీసుకుంటున్న గ్రామస్తుడు

యలమంచిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఆపదలో ఉన్న వారికి, అన్నార్తులు, విద్యార్థులకు సేవ చేయడమే లక్ష్యంగా ఈ సంస్థ ఏర్పాటైంది. ఇటీవలే సంస్థకు యలమంచిలి మండలంలో నూతన పాలక వర్గం ఏర్పడింది. సంస్థ సభ్యులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. గత మూడు రోజులుగా 50 మందికి సభ్యత్వం ఇచ్చినట్లు మండల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ చైర్మన్ డేగల వెంకటేశ్వరరావు, కన్వీనర్ వలవల యజ్ఞప్రసాద్, మండల కమిటీ అధ్యక్షుడు రుద్రరాజు బాల విజయవర్మ చెప్పారు. ఈ నెలాఖరుకు 200 సభ్యత్వాలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వారు వివరించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను వినియోగించుకోవాలి



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్

పాలకొల్లు అర్బన్: ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ కోరారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాపవరం, శివదేవునిచిక్కాలలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాలను నిర్వహించి రోగులకు వైద్య సేవలందించారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నవ్యజీవన్, డాక్టర్ లీనా సుప్రియ, డాక్టర్ సత్య సౌజన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న నూకరాజు

పెనుగొండ: సేంద్రియ ఎరువుల వాడకంతో సాగులో అధిక దిగుబడులు సాధించడమే కాకుండా, సాగును లాభసాటిగా మార్చుకోవచ్చునని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు తెలిపారు. చినమల్లం గరువు పాలెంలో శుక్రవారం వరి సాగులో సేంద్రియ ఎరువులపై అవగాహన సదస్సు నిర్వహించి, రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్ల పంపిణీ చేశారు. డ్వాక్రా మహిళలకు కిచెన్ గార్డెన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టూరి సుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి పి.స్పందన, జిల్లా కో ఆర్డినేటర్ అరుణ, డివిజన్ ఇన్‌ఛార్జి కృపావతి, మండల ఇన్‌ఛార్జి ప్రేమలత, యూనిట్ ఇన్‌ఛార్జి బి.ఆదినారాయణ, వీఏఏ మనోజ్‌కుమార్, డ్వాక్రా సీఏ కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీపీ పెద్ద

పెనుగొండ: పెనుగొండ బాపూజీపురంలో మురుగు డ్రెయినేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దశాబ్ద కాలానికిపైగా బాపూజీపురంలో డ్రెయినేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానికులు డ్రెయినేజీ సమస్యను మాజీ మంత్రి,, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో నిధులు మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు, మండల పరిషత్ నిధులు రూ.18 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టారు. శుక్రవారం డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), నడిపూడి సొసైటీ అధ్యక్షుడు కేశవరపు గణపతి పర్యవేక్షించారు.

గ్రంథాలయ పితామహుడు రంగనాథ్‌కు నివాళి

నరసాపురం రూరల్: నరసాపురం వైఎన్ కళాశాలలో శుక్రవారం గ్రంథాలయ విభాగం యూజీ డిగ్రీ గ్రంథాలయంలో భారత గ్రంథాలయ పితామహుడు రంగనాథ్ 132వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జి.కోటయ్య అధ్యక్షతన జరిగిన సభలో కళాశాల ఉపాధ్యక్షుడు పొన్నపల్లి శ్రీరామారావు, ప్రిన్సిపాల్ అప్పారావు మాట్లాడుతూ విద్యాలయం, వైద్యాలయం, దేవాలయం తరువాత గ్రంథాలయం ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. యువత గ్రంథాలయంలో ఎక్కువ సమయం కేటాయించి పుస్తకాలను పఠించి ఉన్నత విలువలు పెంపొందించుకోవాలన్నారు. తొలుత రంగనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు



వారతిప్పలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

మొగల్తూరు: నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని వారతిప్ప గ్రామంలో రెండో విడత గడపగడప కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. గ్రామంలో రూ.23 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం అదే గ్రామంలో రూ.2 లక్షలతో చేపట్టనున్న ఫిల్టర్ బెడ్ పనులకు శంకుస్థాపన చేశారు. రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి విడత గడప గడపకు కార్యక్రమంలో గ్రామంలోని సమస్యలు తెలుసుకుని పరిష్కరించినట్లు చెప్పారు. రెండో విడతలో కూడా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించుకునేందుకు కృషి చేద్దామన్నారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. వారతిప్ప గ్రామంలో రూ.2.39 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా సేవలు అందుతున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను స్వాగతిస్తున్నారని, ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తుండటం చాలా గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరెన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ తిరుమాని బాపూజీ,, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు తిరుమాని వరలక్ష్మి, లింగం ఏసుబాబు, డీవీవీ సత్యనారాయణ, రాష్ట్ర వన్నెకుల సంక్షేమ సంఘం డైరెక్టర్ బందన పూర్ణచంద్రరావు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు అంద్రాజు చల్లారావు, వ్యవసాయశాఖ ఏడీఏ అనిల్ కుమారి, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్, ఏపీఎం వై.శ్రీనివాస్, ఏఈ అశోక్, పాఠాయకులు పాల్గొన్నారు.

ఆ రెండు గ్రామాల్లో ఎన్నికల సందడి

నరసాపురం రూరల్: పంచాయతీ వార్డు పదవులకు ఉప ఎన్నికలతో కె.బేతపూడి, తూర్పుతాళ్ల గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. నామినేషన్ల ఘట్టం ముగిసే నాటికి తూర్పుతాళ్లలో రెండు, కె.బేతపూడిలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలోని తూర్పుతాళ్ల పంచాయతీలో 12వ వార్డు సభ్యురాలు పోశింశెట్టి కమల, కె.బేతపూడిలో 3వ వార్డు సభ్యురాలు కటికెల సూర్యకుమారి మరణించడంతో ఆయా వార్డుల్లో ఉప ఎన్నికలు జరుగుతున్నాయి. 19వ తేదీన జరగనున్న ఈ ఎన్నికలతో గ్రామాల్లో రాజకీయం వేడెక్కుతుంది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి శుక్రవారం నామినేషన్లు పరిశీలించారు. 12, 13వ తేదీల్లో నామినేషన్ల తిరస్కరణ, 14వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అదేరోజు అభ్యర్థుల ప్రకటన ఉంటుందని రిటర్నింగ్ అధికారులు పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్‌లు తెలిపారు. 19వ తేదీ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ పోలింగ్, 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపారు.

ఈ–క్రాప్ యాప్‌లో నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏవో కె.రాజశేఖర్

పాలకొల్లు అర్బన్: సార్వా పంటకు రైతు భరోసా కేంద్రాల్లో ఈ పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని,, కౌలు రైతులు, రైతులు విధిగా పంట వివరాలను ఈ క్రాప్ యాప్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.రాజశేఖర్ సూచించారు. మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏడీఏ అడ్డాల పార్వతి అధ్యక్షతన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఏవో మాట్లాడుతూ ఈ క్రాప్‌లో పంట వివరాలు నమోదు కాకపోతే సార్వా సీజన్‌కు సంబంధించి పంట నష్ట పరిహారం, బీమా, సున్నా వడ్డీ, పంట రుణాలు, ధాన్యం కొనుగోలు తదితర ప్రయోజనాలు వర్తించవన్నారు. రాపాక ఛానెల్‌పై అనధికారికంగా రొయ్యల చెరువులు తవ్వడం వలన పంట చేలు దెబ్బతింటున్నాయని, అలాగే మంచినీటి చెరువులు కూడా కలుషితమవుతున్నాయని మండల కో ఆప్షన్ సభ్యులు తండా ఇస్సాక్‌రాజు, అరట్లకట్ట ఎంపీటీసీ చింతపల్లి సాయిబాబా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎఫ్‌డీవో ఎల్ఎల్ఎన్ రాజు స్పందిస్తూ అనుమతిలేని చెరువులపై చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ప్రస్తుతం సార్వా సీజన్‌లో వర్షాలు కురవకపోవడం వలన శివారు ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితి ఉందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మండల వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నక్కా సంతోష్‌కుమార్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ ఎస్.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ జేఈ వై.నారాయణరావు, పశువైద్యాధికారి డాక్టర్ పి.వరప్రసాద్, ఎఫ్‌డీవో ఎల్ఎల్ఎన్ రాజు, ఏఈ డ్రెయిన్స్ జి.సతీష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

నరసాపురం రూరల్: రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్‌కుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు మండలాల్లో 360 టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటి వరకూ 80 టన్నుల ఎరువులు విక్రయించడం జరిగిందన్నారు. నరసాపురం, యలమంచిలి, మొగల్తూరు మండలాలకు సంబంధించి 1,600 మెట్రిక్ టన్నుల ఎరువులను ఇండెంట్ పెట్టినట్లు ఏడీఏ తెలిపారు. కార్యక్రమంలో ఏవోలు, జాన్సన్, సీహెచ్ దేవి, షేక్ అబ్దుల్ రహీం, ఏఈవోలు సాయిరామకృష్ణ, ఇబ్బా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రాయకుదురు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి ఎస్ఈ శ్రీనివాసరావు

వీరవాసరం: సీసీ రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాసరావు ఆదేశించారు. వీరవాసరం మండలం రాయకుదురులో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను శుక్రవారం ఆయన తనిఖీ నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ఆయన ఎం బుక్కులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు రోడ్ల సమస్య తలెత్తకుండా పెద్ద ఎత్తున సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులు సక్రమంగా వినియోగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెడ్డం భారతి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు, గెడ్డం భాస్కరరావు, గుడాల వెంకటేశ్వరరావు, విప్పర్తి రాధాకృష్ణ, లొల్ల సీతారాం ప్రసాద్, పోలిశెట్టి శివన్నారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి చిన్న, బొక్క చిన్న, కవురు శివ, తానేటి ప్రసాద్, తానేటి బాలస్వామి, దూది అచ్చియ్య, ఎం భాస్కరరావు, పెద్దిరెడ్డి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ అడవిపాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ మార్టేరు ఫీడర్‌పై సాంకేతిక మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. ఉల్లంపర్రు, నాగరాజుపేట, వడ్లవానిపాలెం, జిన్నూరు గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చైతన్యలో రెడ్ కలర్ డే

పెనుగొండ: విద్యార్థులు సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవాలని చైతన్య ప్రిన్సిపాల్ బి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెనుగొండ చైతన్యలో రెడ్ కలర్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థి స్థాయి నుంచి సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవడంవలన ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చునన్నారు. ప్రైమరీ ఇన్‌ఛార్జి పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ విశ్వరూప మహా సభను జయప్రదం చేయాలి



పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: త్వరలో హైదరాబాద్‌లో ఎంఆర్‌పీఎస్ విశ్వరూప మహాసభ నిర్వహించనున్నట్లు ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు తెలిపారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో జిల్లా ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న హలో మాదిగ ఛలో హైదరాబాద్ విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పసుపులేటి చిన బాబు, తదితరులు పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు ఆటల పోటీలు

సాక్షి, భీమవరం: 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీ విజ్ఞాన వేదిక, జిల్లా సర్వోదయ మండలి సంయుక్త అధ్వర్యాన భీమవరంలోని శ్రీ వెంకటేశ్వర బధిర పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆర్టీసీ డిపో మేనేజర్ గిరిధర్ కుమార్ మాట్లాడుతూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందరికీ ఉండాలనే ఉద్దేశ్యంతో బధిరులకు ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.తిరుపతిరావు మాట్లాడుతూ ఆటల పోటీల ద్వారా బధిరుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులకు రోప్ స్కిప్పింగ్, క్యారమ్స్, షటిల్, డిస్కత్రో, టెన్నికాయిట్, చదరంగం విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుమని తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులకు మోటార్ సైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నా భూమి – నా దేశం నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జరిగిన వసుధకు వందనం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వికలాంగ సంక్షేమ శాఖ ద్వారా పూర్తి సబ్సిడీతో మంజూరైన మోటార్ సైకిళ్లను అందజేశారు. సుమారు 12 లక్షలు ఖరీదు చేసే 10 మోటార్ సైకిళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 1,750 మూడు చక్రాల మోటార్ సైకిళ్లను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపీడీవో ఎన్వీ శివప్రసాద్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు అంద్రాజు చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

అపుస్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు



బహుమతులు అందజేస్తున్న ఎంఈవో గుమ్మళ్ల వీరాస్వామి

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం వల్ల మేథోశక్తి పెంపొందుతుందని మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ల వీరాస్వామి తెలిపారు. శుక్రవారం ఆజాది కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో పాలకొల్లు, పోడూరు, యలమంచిలి మండలాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 35 విద్యా సంస్థల నుండి సుమారు 600 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఎంఈవో వీరాస్వామి విజేతలకు బహుమతులు అందజేశారు. యలమంచిలి ఎంపీడీవో త్రిశూలపాణి, ఉపాధ్యాయులు పీర్ సాహెబ్, డి.వెంకటేశ్వరరావు, ఆర్.ప్రసాద్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు ఎస్.పాపారావు నాయుడు, జోన్ అధ్యక్షుడు కేవీ కృష్ణవర్మ, సెక్రటరీ గొర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం



జక్కరంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి

కాళ్ళ : కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి పునాది అని, అందరూ కలసి పార్టీ బలోపేతానికి కృషి చేసిననాడే ఉండిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయగలమని నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని జక్కరం గ్రామంలో మండల పార్టీ నాయకుల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యకర్త విబేధాలు పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ పర్యటిస్తానని కార్యకర్తలను కలుస్తానని ఆమె తెలిపారు. టీడీపీ కంచుకోట అని చెప్పుకుంటున్న ఉండిని ఈసారి తప్పకుండా పగలగొట్టితీరడం ఖాయమని ఆమె అన్నారు. రాబోయే ఎన్నికల్లో పీవీఎల్ నర్సింహరాజు గెలుపు నల్లేరుపై నడకలా సాగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను గూండాలుగా పోలుస్తూ వారిని తరిమికొట్టాలంటూ అరాచకాలు సృష్టించడమే ప్రతిపక్షాల పని అని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ ఒక రాజకీయ అజ్ఞాని కాబట్టే రెండు చోట్ల పోటీచేసి ఒక్కచోట కూడా గెలవలేకపోయాడని ఎద్దేవా చేశారు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడై ఉండి కూడా ముఖ్యమంత్రిని ఏకవచనంతో పిలుస్తున్నాడని అసహనం వ్యక్తం చేశారు. పవన్ సినిమా యాక్టర్ కాబట్టే ఎవరైనా చూడటానికి వస్తారని, అయితే సినీ నటులు బాబూమోహన్ వచ్చినా అదేవిధంగా వస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యాస్త్రం విసిరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూచంపూడి పద్మావతి, ఎంపీపీ పెన్మత్స విశ్వనాధరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, జిల్లా సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, మండల కన్వీనర్ గణేష్న రాంబాబు, గృహసారధులు. నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొగల్తూరులో వసుధకు వందనం కార్యక్రమంలో సెల్ఫీ దిగుతున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



నరసాపురం 25వ వార్డులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

మొగల్తూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా వసుధకు వందనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలో అమృత్ సరోవర్ చెరువు వద్ద 75 కొబ్బరి మొక్కలను నాటారు. నా భూమి – నా దేశం స్ఫూర్తిగా ఎమ్మెల్యే ప్రసాదరాజు సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. నా భూమి – నా దేశం, నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం అనే కార్యక్రమాలను ఈనెల 9 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో అధికారుల ఆదేశాల మేరకు ప్రతి రోజు కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనీయులు, సాహసవంతులు, వీరులను స్మరించుకునేందుకు ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పడవల మేరీ, తణుకుల మునేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, ఎంపీటీసీ సభ్యుడు డీవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నరసాపురం: ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. పట్టణంలోని 25వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డు సచివాలయం వద్ద అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మొక్కలు నాటారు. వార్డులో కొత్తగా మంజూరైన బియ్యం కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే ముదునూరి మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నా భూమి నా దేశం, నేలతల్లికి వందనం, వీరులకు వందన నినాదాలతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, అలాగే వార్డుల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. కొత్తగా అర్హులైన వారికి రేషన్‌కార్డులు మంజూరు చేసి అందజేయడం జరుగుతందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు, వివిధ కారణాలతో రేషన్‌కార్డులు రద్దయిన వారికి వెంటనే రేషన్‌కార్డులు ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, కౌన్సిలర్లు యర్రా ఉమ, జిల్లెళ్ల దిలీప్, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బర్రి శంకరం, మత్స్యకార సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు అంద్రాజు చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

పెనుగొండ: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు కోరారు. నా భూమి – నా దేశం నేలతల్లికి వందనంలో భాగంగా శుక్రవారం ఆచంట పంచాయతీ పరిధిలో 75 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శి జీవీఎల్ నర్సింహరావు పాల్గొన్నారు. కొడమంచిలిలో ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ ఆధ్వర్యంలో 75 మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణను కాపాడాలని కోరారు. పెనుగొండ పంచాయతీలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈవోపీఆర్డీ ఎస్ ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలంతా ఐక్యంగా జీవించాలి

పాలకొల్లు అర్బన్: కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రజలంతా ఐక్యమత్యంతో జీవించాలని సర్పంచ్ కడలి నాగమణి కోరారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం సగంచెరువు సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నా భూమి నా దేశం , వీరులకు వందనం నినాదంతో ముందుకు సాగాలన్నారు. సచివాలయం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో 75 పండ్ల మొక్కలు నాటారు. ఉప సర్పంచ్ శీలం సత్యనారాయణ, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు మున్సిపల్ కార్యాలయంలో..

పాలకొల్లు సెంట్రల్: ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మునిసిపల్ కార్యాలయంలో నా భూమి – నా దేశం, నేలతల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఏపీజే అబ్దుల్ కలాం పార్క్ వద్ద శిలాఫలకాలు జాతికి అంకితం చేయడం, వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర సమరయోధులను స్మరించుకోవడం, పంచ ప్రాణ ప్రతిజ్ఞ ద్వారా దేశాభివృద్ధికి, దేశభక్తి పెంపుదలకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేస్తూ మునిసిపల్ కార్యాలయంలో దీపాలు వెలిగించారు. వసుధకు వందనం ద్వారా మొక్కలు నాటి నా భూమి నా దేశం పట్ల భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మునిసిపల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, జోగి వెంకటేశ్వరరావు, పెదపాటి పెద్దిరాజు, కాసాని కేశవరావు, చెన్ను విజయ్, గవర శేషగిరి, పాలపర్తి కృపానాథ్, పిల్లా అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.